తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం-24- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 89 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# ఇంటి నిర్మాణం రూ. 5 లక్షలతో పూర్తయ్యే పరిస్థితి లేదు



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రావాలని బీజేపీ ఎంపీలుగా తాము కోరుకుంటున్నామని వెల్లడి
- యూరియా సమస్య కూడా పరిష్కారం కావాలని ఆశిస్తున్నామన్న ఈటల రాజేందర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ కలిశారు.

మిగతా 2లో






# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సరికొత్త వ్యూహం!

- తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం
- రాష్ట్రపతి వద్ద పెండిరగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్ల సవరణ బిల్లు
- బిల్లు ఆమోదం ఆలస్యమవుతున్నందున ప్రత్యామ్నాయ మార్గం ఎంపిక
- పార్టీ పరంగా 42 శాతం సీట్లను బీసీలకు కేటాయించాలని కాంగ్రెస్ నిశ్చయం
- ఈ విధానంతోనే ఎన్నికల బరిలోకి దిగాలని అధికార పార్టీ యోచన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండిరగ్‌లో ఉన్నప్పటికీ, ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన తరపున పోటీ చేసే అభ్యర్థుల్లో 42 శాతం సీట్లను బీసీ వర్గాలకు కేటాయించి ఎన్నికల బరిలోకి దిగనుంది. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం రూపొందించిన బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఎన్నికలను ఆలస్యం చేయడం సముచితం కాదని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో, చట్టపరమైన ఆమోదం కోసం వేచి చూడకుండా పార్టీ స్థాయిలో

మిగతా 2లో



# హాట్ టాపిక్‌గా మారిన యూరియా కొరత

- యూరియా కొరత అధిగమించేందుకు సర్కార్ చర్యలు..!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో గతకొన్ని రోజులుగా యూరియా సమస్య హాట్ టాపిక్‌గా మారింది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడంలేదని అధికార పార్టీ ఆరోపిస్తుంటే.. మరో పక్క రాష్ట్ర బీజేపీ నేతలు అలాంటిదేమీ లేదని కొట్టిపడేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రంగంలోకి దిగారు.యూరియాను ఎప్పటికప్పుడు సరఫరా కేంద్రాలకు తరలించేలా అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో లారీ అసోసియేషన్స్ మధ్య ఏర్పడిన పోటీతో యూరియా రవాణా నిలిచిపోవడంతో.. ట్రాన్స్‌పోర్ట్ సమస్యను స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తున్నారు మంత్రి తుమ్మల. రామగుండం యూరియా ఫ్యాక్టరీతోనూ మంత్రి నిరంతర సంప్రదింపులు జరుపుతున్నారు. శనివారం రామగుండం ఫ్యాక్టరీ ఎండీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలవనున్నారు. కాగా, సాంకేతిక సమస్య కారణంగా రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఉత్పత్తి ప్రారంభం అయితే యూరియా సమస్య కొంతైనా తీరే అవకాశం ఉందని సర్కార్ భావిస్తోంది.

# నేతన్నలకు అండగా నిలవండి.. ` డిప్యూటీ సీఎంకు కేటీఆర్ లేఖ

- పవర్‌లూమ్ కార్మికుల ఆర్థిక సంక్షోభంపై కేటీఆర్ ఆందోళన
- రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిల మాఫీ డిమాండ్
- సిరిసిల్ల నేతన్నల జీవనోపాధి కాపాడే ప్రయత్నాలు
- కుటీర పరిశ్రమల నుంచి ఇండస్ట్రీ-3 కేటగిరీకి మార్పుతో వచ్చిన సమస్యలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



సిరిసిల్లలోని పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవర్ లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను

మిగతా 2లో



# హైదరాబాద్‌లో ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ

- రేపటి నుంచి ఉచితంగా పంపిణీ చేయనున్న హెచ్ఎండీఏ
- లక్ష మట్టి విగ్రహాలను ఈ నెల 24 నుంచి 26 వరకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పర్యావరణ హితమైన ఎకో వినాయక ప్రతిమల పంపిణీకి హెచ్ఎండీఏ సన్నద్ధమైంది. జల వనరుల సంరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా 2017 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని చేపడుతూ ఉచితంగా అందిస్తోంది. సుమారు లక్ష మట్టి విగ్రహాలను ఈ నెల 24 నుంచి 26 వరకు పంపిణీ చేయనున్నట్లు హెచ్ఎండీఏ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడిరచింది.

శిల్పారామం (హైటెక్ సిటీ), మెట్రో క్యాష్ అండ్ క్యారీ (కూకట్‌పల్లి), శిల్పారామం (ఉప్పల్), ఆరోగ్యశ్రీ కార్యాలయం, సైలెంట్ వ్యాలీ హిల్స్ (జూబ్లీహిల్స్), ఐఏఎస్ క్వార్టర్స్,

మిగతా 2లో

# సురవరం సుధాకర్ రెడ్డి కన్నుమూత

- కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత
- గచ్చిబౌలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- మణికొండలో కుటుంబంతో నివాసం – భార్య, ఇద్దరు కుమారులు
- విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల దాకా ఎదుగుదల
- మూడు దఫాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలు
- తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు, కుటుంబ నేపథ్యం
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటంలో కీలకపాత్ర



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) ఇకలేరు. తెలంగాణలోని హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. వయోభారానికి తోడు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. హైదరాబాద్‌లో మణికొండలో నివసిస్తున్న ఆయనకు భార్య డాక్టర్ బీవీ విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు.

మిగతా 2లో

## సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

- సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మరణంపై సీఎం రేవంత్ సంతాపం
- ప్రజా పోరాటాలలో కీలకపాత్ర పోషించిన నేతగా స్మరణ
- రెండు సార్లు నల్గొండ ఎంపీగా ఎన్నికైన సుధాకర్ రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారని, వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు. రెండు సార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకున్ని కోల్పోయామని సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మిగతా 2లో

# నిందితుడిని మా ముందుకు తీసుకురావాలి

- సహస్ర హత్య వెనుక బాలుడి తల్లిదండ్రుల ప్రమేయం ఉంది
- 'క్రికెట్ బ్యాట్ కోసం కాదు, ఇంట్లోని డబ్బు కోసమే బాలుడు వచ్చాడు
- కేసును పోలీసులు తప్పదోవ పట్టిస్తున్నట్టు మాకు అనుమానం ఉంది
- న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాం
- సహస్ర తండ్రి కృష్ణ డిమాండ్




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నిన్న హత్యకు గురైన కూకట్‌పల్లిలోని సహస్ర ఇంటికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ వచ్చింది. ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సీఎంతో మాట్లాడి బాలిక కుటుంబ సభ్యులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో పోలీసుల దర్యాప్తుపై పూర్తి నమ్మకం ఉందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. ఇలాఉండగా,

మిగతా 2లో

# దసరా, దీపావళి పండుగలకు 170 ప్రత్యేక రైళ్లు!

- దసరా, దీపావళి రద్దీకి 170 ప్రత్యేక రైళ్లు
- తిరుపతి–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు
- ప్రతి శుక్ర, శనివారాల్లో చర్లపల్లి–తిరుపతి రైళ్లు
- అక్టోబర్ నుంచి తిరుపతి–హిస్సార్ మధ్య రైలు సర్వీసులు
- హిస్సార్–తిరుపతి ఆదివారాల ప్రత్యేక రైలు ప్రయాణం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

దసరా, దీపావళి పండుగల రద్దీ నేపథ్యంలో 170 ప్రత్యేక రైళ్లు నడపుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తిరుపతిచర్లపల్లి (07481) మధ్య నాలుగు రైళ్లు, సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు చర్లపల్లి తిరుపతి (07482) మధ్య నాలుగు రైళ్లు నడపనున్నారు.


సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రతి శుక్రవారం చర్లపల్లితిరుపతి (07011) మధ్య నాలుగు రైళ్లు, సెప్టెంబర్ 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రతి శనివారం తిరుపతి నుంచి చర్లపల్లికి (07012) మధ్య నాలుగు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు మల్కాజిగిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్,

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇంటి నిర్మాణం రూ. 5 లక్షలతో పూర్తయ్యే పరిస్థితి లేదు

(మొదటి పేజీ తరువాయి)



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు అంశంపై ఆయన మంత్రిని కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణకు కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రావాలని బీజేపీ ఎంపీలుగా తాము కూడా కోరుకుంటామని అన్నారు. బీజేపీ ఎంపీలం అయినప్పటికీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. యూరియా సమస్య కూడా పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా ఉండాలని, అనవసరంగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయవద్దని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించలేదని ఈటల ఆరోపించారు. తమ దృష్టికి వచ్చిన కొందరు పేదల జాబితాను మంత్రికి ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణం రూ. 5 లక్షలతో పూర్తయ్యే పరిస్థితి లేదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కనీసం రూ. 12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో వాటిలో దొంగలు పడుతున్నారని విమర్శించారు. జవహర్ నగర్‌లో మాజీ సైనికోద్యోగులకు సంబంధించిన భూముల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను కూల్చడం సరికాదని అన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సరికొత్త వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)




రిజర్వేషన్లను అమలు చేసి ప్రజాతీర్పు కోరాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే స్థానాల్లో 42 శాతం టికెట్లను బీసీ అభ్యర్థులకే కేటాయించనుంది. బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూనే, ఎన్నికల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పీఏసీ, టీపీసీసీ అడ్వైజరీ కమిటీ సమావేశమైంది. ఈ సమవేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చించినట్లు సమాచారం.

# నేతన్నలకు అండగా నిలవండి..
## ` డిప్యూటీ సీఎంకు కేటీఆర్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)



మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు.

సిరిసిల్ల ప్రాంతం పవర్ లూమ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ సుమారు 25 వేల పవర్ లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో కేటీఆర్ వివరించారు. మారిన మార్కెట్ పరిస్థితులతో బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు తమ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని దొరకడంతో పాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం పవర్ లూమ్ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.


కుటీర పరిశ్రమల కేటగిరీ కింద 50 శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు, అవగాహన లోపంతో ఎస్‌ఎస్‌ఐ యూనిట్లుగా మారడంతో ఇండస్ట్రీ3 కేటగిరీ కిందకు వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు, అలాగే 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ.35.48 కోట్లు బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, ఫలితంగా వారికి పవర్ లూమ్స్ నడపడం కష్టంగా మారిందన్నారు. పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో, సిరిసిల్ల కోఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని కేటీఆర్ తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా చెల్లించలేకపోతున్నదని వివరించారు. నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీఆర్ కోరారు. బకాయిలను మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# సురవరం సుధాకర్ రెడ్డి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల దాకా సురవరం సుధాకర్‌రెడ్డి ఎదిగారు. మూడు దఫాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తెలుగు నేతగా నిలిచారు. ఆయన కంటే ముందు చంద్ర రాజేశ్వరరావు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. సురవరం ప్రతాపరెడ్డి ఆయన పెదనాన్న.

సురవరం సుధాకర్‌రెడ్డి సొంతూరు జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు. ఆయన తన అమ్మమ్మ ఊరు కోడేరు మండలం కొండ్రావుపల్లిలో 1942 మార్చి 25న జన్మించారు. విద్యాభ్యాసం కోసం కర్నూలు వెళ్లారు. 15 సంవత్సరాల వయసులోనే తమ పాఠశాలకు బ్లాక్‌బోర్డులు, పుస్తకాలు కావాలంటూ జరిగిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలం సుధాకర్‌రెడ్డిని ఆకర్షించింది. తెలంగాణ ఉద్యమంలో సుధాకర్‌రెడ్డిది కీలక భూమిక పోషించారు. మొదట్లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు తెలిపిన సీపీఐ తర్వాత ప్రత్యేక ప్యాకేజీతో తెలంగాణ వెనుకబాటుతనాన్ని తీర్చవచ్చని భావించింది. అయితే ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం తప్ప వేరే మార్గం లేదని గుర్తించి పార్టీ వైఖరిని మార్చుకుంది. ఈ నిర్ణయం మారడంలో ఆయన ప్రధానపాత్ర వహించారు.



గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలించనున్నారు. కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం మూడు గంటల వరకు అక్కడే ఉంచనున్నారు. ఆ తర్వాత పార్థివదేహాన్ని గాంధీ ఆసుపత్రికి, సురవరం నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి కుటుంబ సభ్యులు అందజేయనున్నారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఆయన మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు. అనునిత్యం ప్రజల గురించి ఆలోచించే సుధాకర్‌రెడ్డి లేరంటే నమ్మలేకపోతున్నట్లు తెలిపారు. సమకాలీన రాజకీయ నాయకుడిగా ఆయనతో పని చేసిన రోజులు గుర్తొస్తున్నాయని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి సీపీఐ జాతీయ కార్యదర్శి స్థాయికి చేరారని పేర్కొన్నారు.

# సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

(మొదటి పేజీ తరువాయి)

సుధాకర్ రెడ్డి మృతిపట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రెండు సార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప నాయకున్ని కోల్పోయామని మంత్రి తన బాధను వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే.. సుధాకర్ రెడ్డి మరణం పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దేశ రాజకీయాలలో ఆయనది చెరగని ముద్ర అని కొనియాడారు. నిబద్ధత, క్రమశిక్షణ, నిజాయతీ ఆయన సొంతమని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూనే అందరితో కలిసి పనిచేసిన అజాతశత్రువు సుధాకర్ రెడ్డి అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# నిందితుడిని మా ముందుకు తీసుకురావాలి

శనివారం ఉదయం హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. పీఎస్ ఎదుట కూకట్‌పల్లిలో హత్యకు గురైన సహస్ర పేరెంట్స్, బంధువులు బైఠాయించారు. అసలైన దోషులను తప్పించారంటూ ఆరోపించారు. నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. సహస్రని తల్లి రేణుక స్టేషన్ ఎదుట గుండెలవిసేలా రోధించారు. 'నా కూతుర్ని హత్య చేసినట్లు ఆ అబ్బాయిని హత్య చేయాలి. నా మీద, నా భర్త మీద ఎన్నో ఆరోపణలు చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతుర్ని మేము చంపుకున్నామని నా మీద విమర్శలు చేశారు. నా కొడుకు ఆలోచన తీరు మారింది. ఒక్క బ్యాట్ కోసం ఇంత దారుణానికి ఒడిగడతాడా. మొబైల్ తీసుకొచ్చినప్పుడే తల్లిదండ్రులు పరిశీలించి ఉంటే ఈ రోజు నా కూతురికిలా అయ్యేది కాదు. అక్కను చంపిన వాడిని నేను చంపుతాను అంటూ నా కొడుకు మాట్లాడుతున్నాడు. ఈ విషయంలో మైనర్ అబ్బాయి తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. మాకు న్యాయం జరగాలి.. నిందితుడిని మా ముందుకు తీసుకురావాలి.' అని సహస్రని తల్లి వాపోయింది. ఇలా ఉంటే, సహస్ర తండ్రి కృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. 'క్రికెట్ బ్యాట్ కోసం కాదు, ఇంట్లోని డబ్బు కోసమే బాలుడు వచ్చాడు. సహస్ర హత్య వెనుక బాలుడి తల్లిదండ్రుల ప్రమేయం ఉంది. న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాం. కేసును పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నట్టు అనుమానం ఉంది. పోలీసులు మరోసారి దర్యాప్తు చేయాలి' అని సహస్ర తండ్రి కృష్ణ డిమాండ్ చేశారు.



# హైదరాబాద్‌లో ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ

రోడ్డు నంబరు 10 (బంజారాహిల్స్), కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం, హిందూ పత్రిక కార్యాలయం, ట్యాంక్, సచివాలయం, ఎన్‌టీఆర్ గార్డెన్, ప్రియదర్శిని పార్కు (సరూర్‌నగర్), రాజీవ్‌గాంధీ పార్కు (వనస్థలిపురం), కుందన్‌బాగ్, ఐఏస్ కాలనీ (బేగంపేట), దుర్గంచెరువు పార్కు ప్రవేశద్వారం, వేదిక్‌ధర్మ ప్రకాశ్ స్కూల్ (పాతబస్తీ), గ్రీన్‌ల్యాండ్స్ (బేగంపేట), ప్రెస్‌క్లబ్ (సోమాజిగూడ), ఎల్లమ్మ దేవాలయం (బల్కంపేట), టూప్స్ రెస్టారెంట్ (జూబ్లీహిల్స్), పెద్దమ్మ టెంపుల్ (జూబ్లీహిల్స్), రైతు బజార్ (మెహిదీపట్నం), గణేశ్ టెంపుల్ (సికింద్రాబాద్), హెచ్‌ఎండీఏ కార్యాలయం (అమీర్‌పేట), భారతీయ విద్యాభవన్ (సైనిక్‌పురి), వాయుపురి రీక్రేషన్ సెంటర్, సఫిల్‌గూడ పార్కు, మైండ్ స్పేస్ (మాదాపూర్), మైహోం నవదీప (మాదాపూర్), తార్నాక కమర్షియల్ కాంప్లెక్స్, ఇందూ అరణ్య (బండ్లగూడ). రాంకీ టవర్స్ (మాదాపూర్), మలేషియా టౌన్‌షిప్ (కేపీహెచ్‌బీ), ఎస్‌ఎంఆర్ వినయ్ (మియాపూర్), మైహోం జ్యువెల్ పైప్‌లైన్ రోడ్డు (మియాపూర్), ఇందూ పార్చ్యూన్ (కూకట్‌పల్లి), పలు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హెచ్‌జీసీఎల్ కార్యాలయం (నానక్‌రాంగూడ) పూర్తి వివరాల కోసం కె.శంకర్ (ఈఈ) 9849909845, జె.గణేష్ (డిప్యూటీ ఈఈ)7989371104 నంబర్లను సంప్రదించాలని హెచ్‌ఎండీఏ సూచించింది. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ఏటా లక్ష వినాయక మట్టి విగ్రహాలు, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) రెండు లక్షల మట్టి ప్రతిమలను నగరంలోని రీజనల్ సర్కిళ్లలోని వార్డు కార్యాలయాల్లో పంపిణీ కార్యక్రమం చేస్తున్నారు.

# దసరా, దీపావళి పండుగలకు 170 ప్రత్యేక రైళ్లు!




గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్లనుంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 26వ తేదీ వరకు ప్రతి బుధవారం తిరుపతిహిస్సార్ (07717) మధ్య 9 రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. హిస్సార్ నుంచి తిరుపతికి (07718) రైలు అక్టోబర్ 5 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారాల్లో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజిగిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణ, బస్మట్, హింగోలి, వాసిం, అకోలా, షేగావ్, మల్కాపూర్, భుస్వాల్, జల్‌గావ్, ధరన్‌గావ్, అమల్నేర్, నందుర్బార్, ఉద్నా, వడోదరా, రత్లామ్, మాండ్‌సోర్, నీమచ్, చిత్తౌర్‌ఘర్, భిల్వారా, బిజయ్ నగర్ నాసిర్‌బాద్, అజ్మీర్, కృష్ణాఘర్, పులేరా, రింగస్, సికర్, నవాల్‌ఘర్, ఝంజును, చిరావా, లోహార్, సదుల్‌పూర్ స్టేషన్ల మీదుగా వెళ్లనుంది.

నాందేడ్‌ధర్మవరం (07189) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు శుక్రవారాల్లో నడపనున్నారు. సెప్టెంబర్ 7 నుంచి 28వ తేదీ వరకు ధర్మవరం నుంచి నాందేడ్‌కు ఆదివారాల్లో నడిపిస్తున్నారు. ఈ రైలు ముడ్‌ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, లింగంపేట, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం వెళ్లనుంది.

సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ప్రతి శుక్ర, ఆదివారాల్లో బెంగళూరు నుంచి బీదర్‌కు ప్రత్యేక రైలు (06530) నడపనున్నారు. బీదర్ నుంచి బెంగళూరుకు (06540) రైలును సెప్టెంబర్ 6 నుంచి 29వ తేదీ వరకు శని, సోమవారాల్లో నడిపించనున్నారు. యశ్వంత్‌పూర్‌ధన్‌బాద్ (06563) ప్రత్యేక రైలును ఇవాల్టి నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు ప్రతి శనివారం నడిపించనున్నారు. ధన్‌బాద్ నుంచి యశ్వంత్‌పూర్ (06564) రైలును ఈ నెల 25వ తేద ఈనుంచి డిసెంబర్ 29వ తేదీ వరకు నడిపిస్తున్నారు.






# జేవిఆర్ కళాశాలలో ఎన్సిసి కాడెట్స్ ఎంపిక

**సత్తుపల్లి, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి జేవిఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈ రోజు ఎన్సిసి ఎన్రోల్మెంట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. మొత్తం 80 మంది విద్యార్థులు శారీరక పరీక్ష, రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో పాల్గొని ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. కార్యక్రమంలో కల్నల్ ఎస్కే భద్ర, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. గోపి, ఎన్సిసి కేర్ టేకర్ రవికుమార్, రెహమాన్ తో పాటు కాడెట్స్ పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి కల్నల్ ఎస్కే భద్ర మాట్లాడుతూ ఎన్సిసి కేవలం శిక్షణ మాత్రమే కాకుండా జీవితాన్ని మలిచే గొప్ప అవకాశం అని అన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతా భావం ఎన్సిసి ద్వారా పొందవచ్చని, భవిష్యత్తులో సైన్యంలోనూ, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ఈ అనుభవం బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. దేశానికి సేవ చేయాలన్న తపన ఉన్న ప్రతి యువకుడికి ఎన్సిసి ఒక స్వర్ణావకాశమని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. గోపి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్సిసి పట్ల చూపుతున్న ఉత్సాహం ప్రశంసనీయం అని అన్నారు. ఎన్సిసి విద్యార్థుల్లో దేశభక్తి, స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించే అద్భుత వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.






# అంతరించిపోతున్న జానపద కళలను బతికించాలి

- ప్రభుత్వం జానపద కళాకారుల కోసం జానపద అకాడమీ ఏర్పాటుచేయాలి
- తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి
- ఖమ్మంలో ఘనంగా జానపద దినోత్సవ వేడుకలు

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 23(తెలంగాణ ముచ్చట్లు)**

అంతరించిపోతున్న జానపద కళలను బతికించాలని, జానపద కళాకారుల కోసం ప్రత్యేక జానపద అకాడమీని ఏర్పాటుచేయాలని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ జానపద దినోత్సవ సందర్భంగా ఖమ్మం నగరంలోని సంజీవరెడ్డి భవనంలో శనివారం జానపద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం, కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద కళాకారులు కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు పోలూరి రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి లు ముఖ్య అతిథులుగా విచ్చేసి వారు మాట్లాడుతూ.. జానపద కళాకారులకు ప్రభుత్వం తక్షణమే జానపద అకాడమీ ఏర్పాటుచేసి అంతరించిపోతున్న జానపద కళలను బతికించాలని కోరారు. 1848 సంవత్సరంలో విలియన్ థామస్ ఫోక్ లిటరేచర్ అనే పదాన్ని కనుగొని జానపద దినోత్సవంగా ప్రకటించారు. ఆగస్టు 22ను ప్రపంచ జానపద దినోత్సవంగా ప్రకటించి అన్ని జిల్లాలలో జానపద జాతరను నిర్వహించాలని ప్రభుత్వానికి విన్నవించారు. కాంగ్రెస్ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు వంగపండు పుల్లారావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు నంద్యాల నాగేశ్వరరావు, కొచ్చర్ల గురవయ్య, కర్ష పుల్లయ్య, అద్దంకి నరసింహారావు, బొడ్డు నాగేశ్వరావు, పెద్దపాక విజయ్, దప్పు శ్రీకాంత్, డోలక్ నరేష్, ఉపేందర్, వంశీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.





# కే.పి.ఆర్ లో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం!

- భారతీయ అంతరిక్ష కేంద్రం నమూనా ఆవిష్కరణ.

**సత్తుపల్లి,ఆగస్టు 23(తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి పట్టణంలో కే పి ఆర్ గౌతమ్ పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాల విధానం, అంతరిక్ష కేంద్ర నిర్మాణం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 9వ తరగతి విద్యార్థి భూక్య హనీష్ కుమార్ రూపొందించిన భారతీయ అంతరిక్ష కేంద్రం బి ఏ ఎస్ నమూనాను ఆవిష్కరించారు. చిన్నతనం నుంచే అంతరిక్షంపై ఆసక్తితో పరిశోధనలు ప్రారంభించిన హనీష్, వాడి పారేసిన వస్తువులతో తక్కువ ఖర్చుతో ఈ నమూనా తయారు చేశాడు. దీన్ని సిద్ధం చేయడానికి రెండు నెలలు పట్టిందని, భవిష్యత్తులో భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో చేరి దేశానికి సేవ చేయాలనుకుంటున్నానని విద్యార్థి తెలిపాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ మా పాఠశాలలో ఇలాంటి ప్రతిభావంతుడు ఉండడం గర్వకారణం. హనీష్ భవిష్యత్తులో ఉపగ్రహ, అంతరిక్ష పరిశోధనల్లో రాణించాలని కోరుకుంటున్నామని అభినందించారు. హనీష్ విజయానికి తల్లిదండ్రుల సహకారం ఎంతో ప్రధానమని ఆయన అన్నారు. ఆర్థికంగా సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ కుమారుడి ఆసక్తిని ప్రోత్సహించడానికి వెనుకాడలేదని తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- 25 మంది యువకుల రక్తదానం.

**సత్తుపల్లి,ఆగస్టు 23( తెలంగాణ ముచ్చట్లు):**

బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ కళాశాలలకు చెందిన 25 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరాన్ని శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, మట్టా దయానంద్ కలిసి ప్రారంభించారు. రక్తదానం చేయటం మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని వారు పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఇటువంటి సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని సూచించారు. రక్తదాతలకు పండ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

బ్రహ్మకుమారీస్ ముఖ్య కార్యనిర్వాహకులు దాదీ ప్రకాష్ మణి 18వ మెమోరియల్ డేను విశ్వ బంధుత్వ దినోత్సవంగా గుర్తిస్తూ సమాజ సేవా విభాగం తరపున ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ చీఫ్ డాక్టర్ ఆకాష్, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, బ్రహ్మకుమారి రాధిక, జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ధారా కృష్ణారావు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోకుల్ నగర్ భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: బీజేపీ నేత రవీందర్ సాగర్

**మల్లాపూర్, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో జరుగుతున్న భూకబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ డిమాండ్ చేశారు.

గోకుల్ నగర్‌లో అమాయక ప్రజలు కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లపై కొంతమంది కబ్జాదారులు కన్నేసి, నకిలీ జిపిఏ పత్రాలతో భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులు, ప్రభుత్వం ఈ వ్యవహారంలో తక్షణం జోక్యం చేసుకోవాలని, లేకపోతే కోర్టును ఆశ్రయించి పోరాటం కొనసాగిస్తానని హెచ్చరించారు.

జయప్రద కాలనీలో కూడా ప్రభుత్వ పార్క్ స్థలం, షాపింగ్ కాంప్లెక్స్ స్థలాలను అక్రమంగా కబ్జా చేసి అమ్మిన ఘటనలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించిన రవీందర్ సాగర్, త్వరలో బండారం బయటపెడతానని అన్నారు.



# బొల్లారం కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా ముగిసిన 54వ జాతీయ క్రీడోత్సవాలు

**సికింద్రాబాద్, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

సికింద్రాబాద్ బొల్లారం పి.ఎం. శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఐదు రోజుల పాటు జరిగిన 54వ జాతీయ క్రీడోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ క్రీడలలో 14, 17, 19 ఏళ్ల వయస్సులోపు బాలికల కోసం ఆర్చరీ, విలువిద్య వంటి పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వీణా అనిల్ కుమార్ రోటే మాట్లాడుతూ, ఈనెల 19 నుంచి 23 వరకు జరిగిన ఈ క్రీడలలో దేశవ్యాప్తంగా 20 రీజియన్లకు చెందిన 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినుల కోసం పాఠశాల ఆవాస సదుపాయాలను కూడా కల్పించినట్లు పేర్కొన్నారు.

ముగింపు కార్యక్రమానికి అంతర్జాతీయ హెప్టాథ్లాన్ అథ్లెట్ అగసర నందిని ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఇందులో చెన్నై రీజియన్ ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, "క్రీడల్లో గెలవడం మాత్రమే కాదు, పాల్గొనడం కూడా అంతే ముఖ్యమైందని, గెలుపు సాధించేందుకు కృషి చేయాలని" ప్రోత్సహించారు.

కార్యక్రమంలో పి.జి.టి. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీరాయప్ప తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన దయ్యాల హేమంత్

**వనపర్తి,ఆగస్టు23 (తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డిని వెల్టూర్ గ్రామానికి చెందిన దయ్యాల హేమంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో నూతన అంగన్వాడి భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను హేమంత్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా దయ్యాల హేమంత్ మాట్లాడుతూ.. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అభివృద్ధి పట్ల ఆయన చూపిస్తున్న శ్రద్ధకు ఎమ్మెల్యే కు హేమంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ధర్మసాగర్ మండల కన్వీనర్‌గా పట్ల రమేష్

**ధర్మసాగర్,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):**



హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన యువనాయకుడు పట్ల రమేష్‌ను బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ధర్మసాగర్ మండల కన్వీనర్‌గా నియమించినట్లు మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నియామకంతో పార్టీ బలోపేతం కాగలదని, సోషల్ మీడియా వేదికలో పార్టీ విధానాలను ప్రజలకు చేరవేయడంలో రమేష్ కీలక పాత్ర పోషిస్తాడని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పట్ల రమేష్ మాట్లాడుతూ, పార్టీ భవిష్యత్తు కోసం అంకిత భావంతో పనిచేస్తానని, నాయకత్వం ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం ఈ పదవి రావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారికీ రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## అన్నపూర్ణ కాలనీ పార్క్ రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు వేయాలని కార్పొరేటర్ కు వినతి

**నాచారం, ఆగస్ట్ 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే పోచమ్మ గుడి నుండి అన్నపూర్ణ కాలనీ పార్క్ రోడ్డు వరకు ఇంకా సిమెంట్ రోడ్డు వేసే పనులు మిగిలి ఉన్నాయి.

ఈ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్పొరేటర్ మాట్లాడుతూ, మిగిలిన రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వై. యాదగిరి, మారయ్య, అశోక్, ఎం. యాదగిరి, పెంటయ్య, ప్రభాకర్, రాజ్‌కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ చారి, ఎన్. యాదయ్య, ఐలాపురం, పరమేష్, పరశురాముడు, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## లచ్చన్నగూడెంలో విద్యుత్ శాఖ "పొలం బాట" కార్యక్రమం

**సత్తుపల్లి,ఆగస్టు 23(తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండల పరిధిలోని లచ్చన్నగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం "పొలం బాట" కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రైతులకు కేపాసిటర్ల ప్రాముఖ్యత, విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటార్లు నడిపేటప్పుడు భద్రతా చర్యల గురించి అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అంకారావు (ఏఈ), వెంకటేశ్వరరావు (లైన్ మెన్), గంధం వెంకటేశ్వరరావు (లైన్ మెన్), సాయి కుమార్ (అసిస్టెంట్ లైన్ మెన్), రాజేష్ (అసిస్టెంట్ లైన్ మెన్) పాల్గొని గ్రామస్థులతో మమేకమయ్యారు.

గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమాన్ని అభినందించారు.



## సీనియర్ విలేకరి రవికుమార్ తల్లిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, ఆగష్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తన అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు. శనివారం ఆయన సీనియర్ విలేకరి రవికుమార్ ఇంటికి వెళ్లి వారి మాతృమూర్తి మన్నెమ్మను పరామర్శించారు.

మన్నెమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలుసుకున్న వెంటనే మైనంపల్లి, తన తీరిక సమయాన్ని కేటాయించి రవికుమార్ కుటుంబాన్ని కలిసారు. ఈ సందర్భంగా మన్నెమ్మ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ఆమెకు ధైర్యం చెప్పి, కుటుంబ సభ్యులను ఆత్మస్థైర్యంతో ఉండమని ప్రోత్సహించారు.

**ఉత్తమ వైద్యం కోసం చర్యలు**

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, యశోద ఆస్పత్రి వైద్య బృందంతో స్వయంగా మాట్లాడి, మన్నెమ్మకు నాణ్యమైన చికిత్స అందేలా చూడాలని కోరారు. అవసరమైనంత వరకు తనవంతు సహాయం అందిస్తానని, రవికుమార్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

**విలేకరుల పట్ల గౌరవం**

సీనియర్ జర్నలిస్టుల కుటుంబాలను ప్రోత్సహిస్తూ, సమాజంలో విలేకరుల పాత్రను గుర్తించడంలో మైనంపల్లి చూపిన ఈ చొరవ స్థానికంగా ప్రశంసలు పొందుతోంది. మైనంపల్లి హనుమంతరావు ప్రజలకు చేరువగా ఉండే రాజకీయ నాయకుడిగా పేరుపొందిన సంగతి తెలిసిందే.






## సత్తుపల్లిలో డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం!

- డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ.
- డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్.

**సత్తుపల్లి, ఆగస్టు 23(తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండలంలో యువసేవ సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల అనేక కుటుంబాలు క్షీణిస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నేతృత్వంలో గత 10 నెలలుగా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక చర్యలు తీసుకోవడం వలన సత్తుపల్లి నియోజకవర్గంలో డ్రగ్స్ వాడకం గణనీయంగా తగ్గిందని తెలిపారు. డ్రగ్స్ మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సమాజం నుంచి వాటిని పూర్తిగా తరిమేయడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు.

కార్యక్రమంలో సత్తుపల్లి-వేంసూరు సబ్ ఇన్స్పెక్టర్లు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద బాబు, చల్లగుల నరసింహ రావు, గాదె చెన్నారావు, కమల్ పాషా, యువసేవ సమితి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా సరఫరా లో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది

- మాజీ మంత్రి దయాకర్ రావు అవగాహన రహితంగా మాట్లాడుతున్నారు.
- హసన్ పర్తి పిఎసిఎస్ చైర్మన్ బిల్లా ఉదయ రెడ్డి.

**హసన్ పర్తి,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):**



హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విలేకరుల సమావేశం నిర్వహించి పిఎసిఎస్ చైర్మన్ జిల్లా ఉదయ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు యూరియా సరఫరా లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి చేసినా ఆరోపణలు సరైనవి కావని అన్నారు. యూరియాను కేంద్ర ప్రభుత్వం ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయవలసి ఉండగా ఆగస్టు వరకు 5.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని గత సంవత్సరం దాదాపు 91 లక్షల ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. ప్రస్తుత సంవత్సరం 118లక్షల ఎకరాల పైచిలుకు భూమి సాగులోకి రావడం జరిగిందని సాగు ఎకరాలు పెరగడంతో యూరియా కొరత ఏర్పడిందని అన్నారు.బిజెపి పాలిత ప్రాంతాలు కానటువంటి రాష్ట్రాల మీద కక్ష సాధింపు చర్యలు కేంద్ర ప్రభుత్వం చేసి యూరియా కొరత ఏర్పరిచి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసు పాలు చేస్తుందని ఆరోపించారు. మాజీ మంత్రి దయాకర్ రావు అవగాహన రహితంగా మాట్లాడుతున్నారని రైతుల పక్షాన కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం లోని మంత్రులు రాష్ట్రానికి వచ్చిన యూరియా సరిపోడం లేదని చర్చలు జరిపారని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అడగడంతో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా ఇవ్వడం జరిగిందని బి ఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని వచ్చిన ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో సరిపడా ఎరువులు అందుతాయని వ్యవసాయ అధికారుల ద్వారా తెలుసుకున్నామని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఇలాంటి అవకతవలు జరిగిన చర్చలకు సిద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 100% రావలసిన యూరియాలో 35% కేంద్ర ప్రభుత్వం కోత విధించడంపై చర్చించి రైతుల పక్షాన నిలబడలని ప్రజా ప్రభుత్వం పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, పిఎసిఎస్ చైర్మన్ లు రాజేష్ గౌడ్, గోపాల్ రెడ్డి,మండల మహిళా అధ్యక్షురాలు జోరుకపూల,తోకల లక్ష్మారెడ్డి,రత్నాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,గొర్రె కిరణ్ కుమార్,మదన్ గౌడ్, సునీల్,వెంకట స్వామి గౌడ్,శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

**మల్కాజ్గిరి, ఆగస్ట్ 23 (తెలంగాణ ముచ్చట్లు)**




రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు సౌకర్యం కల్పిస్తూ, ఎలాంటి అవాంఛిత ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సీపీ మాట్లాడుతూ, మండపాల్లో డిజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల్లో క్యూలైన్ల ఏర్పాటుతో భక్తుల రద్దీని నియంత్రించాలని సూచించారు. సీసీ టీవీ కెమెరాలను విస్తృతంగా వినియోగించి విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని, డయల్ 100 కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, సంఘవిద్రోహ శక్తులపై నిఘా ఉంచాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచాలని సూచించారు. నిమజ్జనానికి చెరువులు, నీటి కుంటల వద్ద టెంట్లు, క్రేన్లు, ఫ్లడ్‌లైట్లు, మొబైల్ టాయిలెట్లు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని, జిహెచ్ఎంసి, విద్యుత్, అగ్నిమాపక, నీటి పారుదల, రవాణా తదితర శాఖలతో సమన్వయం సాధించాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ అధికారులను తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, సీసీఆర్బీ అధికారులు పాల్గొన్నారు.





## వెల్టూర్ లో అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెద్దమందడి,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నూతన అంగన్వాడి భవనాన్ని ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, అంగన్వాడి ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పెద్దమందడి, అడ్డాకుల మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ..తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పేద ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వని పరిస్థితి నెలకొంది" అని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు జి. ప్రేమ్ సాగర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కె. రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ టి. రఘు ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి. సాయి చరణ్ రెడ్డి, ఆర్. జగదీశ్వర్ రెడ్డి, డి.ఎస్. మహేష్, గుండెల ఆంజనేయులు, జిల్లా దిశ కమిటీ సభ్యుడు ఎం. రవి నాయక్, మాజీ జెడ్పిటిసి కె. వెంకటస్వామి, మాజీ ఎంపిటిసిలు సి. వెంకటయ్య, రామచంద్ర గౌడ్, శివశంకర్, వెంకటస్వామి, కె. బాలుచంద్రయ్య, సి. వెంకటేష్, తహసీల్దార్లు ఎన్. సరస్వతి, శేఖర్, గ్రామ కార్యదర్శి వెంకటస్వామి, కావలి రాజు, డి. వివేకానంద సాగర్, వడ్డే శేఖర్, డి. రవి సాగర్, డీలర్ శ్రీను, చందురెడ్డి, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక








# బీజేపీ దేశాన్ని దోచుకుంటోంది

**వరంగల్ ఎంపీ కడియం కావ్య**
**దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం**

**హన్మకొండ,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):**


హనుమకొండలో జరిగిన తెలంగాణ పీసీసీ జనహిత పాదయాత్ర సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.
డీసీసీ భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ధనసరి సీతక్క, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ కడియం కావ్య, బీజేపీ దేశాన్ని దోచుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఓటు హక్కును హరించి, దొంగదారిన మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు.
ఆమె తెలిపిన వివరాల ప్రకారం, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆగస్టు 25న సాయంత్రం 4 గంటలకు వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద మార్కెట్ నుండి వర్ధన్నపేట టౌన్ అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర చేయనున్నారు. ఈ పాదయాత్రలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో వరంగల్ నగరానికి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి లభిస్తోందని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఇప్పటికే 6 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించడంతో నగరంలోని మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వరంగల్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.
రాబోయే 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా నిలబెట్టే కర్తవ్యాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక్కో సైనికుడిలా నిర్వర్తించాలంటూ ఎంపీ కడియం కావ్య పిలుపునిచ్చారు.

## ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం ఉద్యమానికి తీరని లోటు

**సిపిఐ మల్కాజ్గిరి మండల సమితి ఆధ్వర్యంలో ఘన నివాళులు**

**మల్కాజ్గిరి, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

సిపిఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉత్తమ పార్లమెంటేరియన్ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిహెచ్. దశరథ్ పేర్కొన్నారు.
వినాయక్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ, "సుధాకర్ రెడ్డి జీవితమంతా రైతులు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం అంకితమైంది. ఆయన బాటలో నడిచినప్పుడే మనం నిజమైన నివాళి అర్పించినవారమవుతాము. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి దశ నుండి అణగారిన ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడారు" అని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, బి. యాదగిరి, జే. రాములు, ఆర్. గిరిజ, ఎం. లింగం, కే. ప్రభాకర్, పి. సత్యనారాయణ, ఎస్‌కె. అజీజ్, సయ్యద్ యూసుఫ్, సి. కృష్ణ, ఎస్. కాసిం తదితరులు పాల్గొన్నారు.
ప్రజా కళాకారుడు సి. వెంకటాచారి సుధాకర్ రెడ్డి స్ఫూర్తిని ప్రతిబింబించే పాట పాడి నివాళులర్పించారు.








## అమావాస్య అన్నదాన వితరణ – వాసవి మిత్రమండలి సేవా కార్యక్రమం

**ఏ.ఎస్.రావు నగర్, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు)**

వాసవి మిత్రమండలి మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా వద్ద శనివారం నిర్వహించిన అమావాస్య అన్నదాన వితరణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది. ప్రతి నెల అమావాస్య రోజున పేదలు, నిరుపేదలకు అన్నప్రసాదాన్ని పంచుతూ వస్తున్న మిత్రమండలి ఈసారి కూడా వందలాది మందికి భోజనం అందించింది.
కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి జోన్ ఏసీపీ వై. వెంకట రెడ్డి, కుషాయిగూడ సిఐ యల్ భాస్కర్ రెడ్డి హాజరై, మిత్రమండలి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వారు మాట్లాడుతూ – "సమాజంలో పేదల పట్ల దయ, కరుణ చూపడం అత్యంత పుణ్యకార్యం. ఈ విధమైన కార్యక్రమాలు సమాజానికి ఆదర్శం" అని పేర్కొన్నారు.

**పించన్ల పంపిణీ**

ఈ సందర్భంగా కుషాయిగూడకు చెందిన పేద వృద్ధ మహిళలు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు ప్రతినెలా అందించే పించన్లు అందజేశారు. ఒక్కొక్కరికి ₹1000 చొప్పున అందజేయగా, వృద్ధులు కృతజ్ఞతా భావం వ్యక్తం చేశారు.
కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పెద్ది నాగరాజు గుప్త మాట్లాడుతూ – "వాసవి మిత్రమండలి లక్ష్యం సమాజ సేవ. భవిష్యత్తులో మరింత విస్తృతంగా అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పేదలకు వైద్య సహాయం అందించేందుకు ప్రయత్నిస్తాం" అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్త, వైవియు నాగేశ్వర్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్తా, అమర కృష్ణ గుప్తా, బల్లి శ్రీధర్ గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

**సేవా భావమే లక్ష్యం**

మిత్రమండలి సభ్యులు మాట్లాడుతూ – "పేదల ఆకలి తీరితేనే మన సేవ సార్థకం అవుతుంది. భవిష్యత్తులో అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలలో కూడా అన్నదాన కార్యక్రమాలు విస్తరిస్తాం" అని వెల్లడించారు.

## అమ్మపల్లిలో నూతన భవనాల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెద్దమందడి,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి శనివారం పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో రెండు నూతన భవనాలకు శంకుస్థాపనలు చేశారు. గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడి భవనం నిర్మాణానికి పునాదిరాళ్లు వేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ – "గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది. పంచాయతీ భవనం, అంగన్వాడి వంటి వసతులు ప్రతి గ్రామానికి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడతాం" అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు, గ్రామ నాయకులు, పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







## 18 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

**చిల్కానగర్, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్‌లోని ప్రశాంత్ నగర్ కాలనీలో సుమారు రూ !18 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, రోడ్డు పనుల నాణ్యతపై ఎటువంటి రాజీపడరాదని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. కాలనీవాసులకు పనుల సమయం లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ కోకొండ, కోకొండ జగన్, చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బీరప్ప గడ్డ బాలు, బంటి గౌడ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ మోహన్, జీఎస్ కృష్ణ స్వామి, ముత్యం రెడ్డి సుబ్బారెడ్డి, శాస్త్రి, లక్ష్మి భూమేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పానుగల్ గ్రామానికి చెందిన ఎనుముల కిష్టయ్య హత్య కేసును చేదించిన పోలీసులు

**వనపర్తి,ఆగస్టు23(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పానగల్ గ్రామానికి చెందిన ఎనుముల కిష్టయ్య హత్య కేసును పానుగల్ పోలీసులు సేవించారు.వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు శనివారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన వసంతపురం రాములు, తన భార్య విడిచి వెళ్లడానికి కిష్టయ్య కారణమని అనుమానం, అలాగే డబ్బులు దొంగలించి బైక్ కొనాలన్న ఉద్దేశంతో పథకం ప్రకారం హత్య చేశాడు, అని చెప్పారు. ఆగస్టు 20న రాత్రి కిష్టయ్య ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో రాములు అతని తలపై పప్పుగుత్తితో కొట్టి, అనంతరం గొంతు పట్టి హత్య చేశాడు. అనంతరం జేబులో ఉన్న రూ.40,000 నగదు దోచుకొని, నేరానికి ఉపయోగించిన పప్పుగుత్తి కాడను కాలువలో పారవేశాడు. దొంగిలించిన డబ్బులో రూ.6,000 ఖర్చు చేసి, రూ.33,000 ఇంట్లో దాచిపెట్టినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. (23082025) ఉదయం గ్రామంలో తిరుగుతున్న రామును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి మిగిలిన నగదు, రక్తపు మరకలున్న బట్టలు, పప్పుగుత్తి కాడను స్వాధీనం చేసుకున్నారు.
ఈ కేసు ఛేదనలో వనపర్తి సీఐ కృష్ణయ్య, పానుగల్ ఎస్సై శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారని డీఎస్పీ పేర్కొన్నారు. వీరిని ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేస్తామని తెలిపారు.




## మౌలిక వసతులు కల్పించాలని మాజీ కార్పొరేటర్ తో సమావేశం



◆ **మధు సాయి రామ్ రెసిడెన్సీ బ్లాక్ 2. అసోసియేషన్ సభ్యులు**

**మల్కాజ్గిరి, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచనల మేరకు ఆనంద్‌బాగ్‌లోని మధు సాయి రామ్ రెసిడెన్సీ బ్లాక్ 2 అసోసియేషన్ సభ్యులు స్థానిక సమస్యలను మాజీ కార్పొరేటర్ ఎన్. జగదీష్‌గౌడ్‌కు వివరించారు. వీధి దీపాలు, సీసీ రోడ్డు, డ్రైనేజీ వంటి పలు సమస్యలను నివాసితులు ప్రస్తావించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సూర్యకుమారి, రాంచందర్, సురేష్, సెంధిల్, మనోజ్, సుబ్రమణియన్, ఆనంద్, జగన్నాథ్, స్వరూప్, మునికుమార్, విజయ్, గీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# సౌత్ ఇండియన్ బ్యాంక్ నుంచి 'ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్' ప్రారంభం

ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన సౌత్ ఇండియన్ బ్యాంక్, వినియోగదారుల కోసం సరికొత్త గోల్డ్ లోన్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. 'ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో ఈ రుణ పథకాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ స్కీమ్ ద్వారా వినియోగదారులు తమ బంగారం విలువలో 90 శాతం వరకు రుణంగా పొందవచ్చని పేర్కొంది.ఈ పథకం కింద కనీసం రూ. 25,000 నుంచి గరిష్ఠంగా రూ. 25 లక్షల వరకు రుణం తీసుకోవచ్చు. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేందుకు మూడేళ్ల వరకు సౌకర్యవంతమైన కాలపరిమితిని కూడా బ్యాంకు కల్పిస్తోంది. అత్యవసర ఆర్థిక అవసరాలు ఉన్నవారికి ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని బ్యాంకు వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), ఇతర చిన్న వ్యాపారుల ఆర్థిక అవసరాలను లక్ష్యంగా చేసుకుని ఈ పథకాన్ని రూపొందించినట్లు సౌత్ ఇండియన్ బ్యాంక్ వివరించింది. వ్యాపార విస్తరణ, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు లేదా ఇతర వ్యక్తిగత ఖర్చుల కోసం ఈ రుణాన్ని సులభంగా వినియోగించుకోవచ్చని తెలిపింది. ఈ లోన్‌పై ఎలాంటి దాపరిక ఛార్జీలు ఉండవని, పూర్తి పారదర్శకతతో సేవలు అందిస్తామని బ్యాంకు స్పష్టం చేసింది.




# కేవలం 24 రూపాయలే.... వారందరికీ జియో మంచి ఛాన్స్!

ముకేశ్ అంబానీ నేతృత్వంలో ప్రారంభమైన జియో వ్యాపారాలు దూసుకెళ్తున్నాయి. కొత్త కొత్త రంగాల్లోకి ప్రవేశిస్తూ సంచలనాలు సృష్టిస్తున్నాయి. ఆర్థిక సేవల విభాగం జియోఫైనాన్స్ మరో సంచలనానికి తెరలేపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ ధరకే ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. కేవలం 24 రూపాయలతో ఐటీఆర్ ఫైలింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు ఇది అదిరే శుభవార్త అనే చెప్పాలి. జియో ఫైనాన్స్ యాప్ ద్వారా కొత్త ట్యాక్స్ ప్లానింగ్, ఫైలింగ్ ఫీచర్ తెచ్చింది. ట్యాక్స్ పేయర్లు ఈ యాప్ ద్వారా పన్ను విధానం ఎంచుకోవడంతో పాటుగా గరిష్ఠ మినహాయింపులు పొందేందుకు సహాయం చేయనున్నట్లు జియోఫైనాన్స్ పేర్కొంటోంది. అయితే, ట్యాక్స్ పేయర్లలో ఒక ప్రశ్న మొదలైంది. రూ.24 ప్లాన్ అనేది ట్యాక్స్ పేయర్లందరికీ వర్తిస్తుందా? ఇతర ప్లాట్‌ఫామ్స్ అయిన క్లియర్ ట్యాక్స్, ట్యాక్స్ బడ్డీ, ట్యాక్స్ 2 విన్, మైఐటీ రిటర్న్స్ వంటి వాటితో ఎలా భిన్నంగా ఉంటుంది? అని ప్రశ్నిస్తున్నారు. జియోఫైనాన్స్ సంస్థ ట్యాక్స్ బడ్డీ భాగస్వామ్యంతో ఈ రూ.24 ప్లాన్ ప్రకటించింది. ప్రస్తుత ట్యాక్స్ మార్కెట్లో అత్యంత చీఫ్ ప్లాన్ అని చెప్పవచ్చు. ఇది ఒక బేసిక్ ప్లాన్. రూ.24 ప్లాన్ అనేది కేవలం ఐటీఆర్ 1 ఫైలింగ్ కి మాత్రమే వర్తిస్తుంది. అంటే కేవలం రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండి ఒకే ఫారం 16 అందుకునే ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ ప్లాన్ ద్వారా సీఏ సహాయం ఉండదు. ట్యాక్స్ పేయర్ స్వయంగా ఫైలి చేయాల్సి ఉంటుంది. నిల్ ఐటీఆర్ లేదా సింపుల్ ఐటీఆర్ 1 ఫైలింగ్ చేసేందుకు మాత్రమే వర్తిస్తుంది. అయితే ఇది బిజినెస్ ఆదాయం, క్యాపిటల్ గెయిన్స్, విదేశీ పెట్టుబడుల వంటి కాంప్లెక్స్ ట్యాక్సులు ఉన్న వారికి పని చేయదు. నిపుణుల సహాయం తీసుకోవాలని అనుకునే వారికి జియోఫైనాన్స్ రూ.999 ప్లాన్ అందిస్తోంది.

# రియల్ మనీ గేమ్‌ల నిలిపివేత

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం లభించినందున.. చట్టంగా మారింది.ఇందులో ఏ క్లాజులు ముందుగా అమల్లోకి తెస్తారనే విషయాలపై ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్ స్పష్టతనిచ్చారు. 'ప్రతిపాదిత నిబంధనలపై ఐటీ శాఖ పనిచేస్తోంది. ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమ్స్ ప్రోత్సాహం, నియంత్రణ విషయంలో ఒక వ్యవస్థను తీసుకొస్తారు. అదే సమయంలో ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్2025లో పేర్కొన్న నియంత్రణ సంస్థను ఏర్పాటు చేస్తార'ని కృష్ణన్ వివరించారు. ఈ చట్టం ద్వారా దేశంలో అన్నిరకాల ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధించగా, ఇప్పటికే సంస్థలు రియల్ మనీ గేమ్‌లను నిలిపివేశాయి. అదే సమయంలో ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ బిల్లును తీసుకొచ్చారు. 'సొంతంగా నిలబడగలిగే చట్టం కాదిది. బిల్లులోని ఇతర సెక్షన్లకు ముందే 'నిషేధా'న్ని అమల్లోకి తీసుకొచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్న'ట్లు తెలిపారు. ఎందుకంటే ఆ విషయానికి సంబంధించిన నిర్దిష్ట నిబంధనలేమీ అందులో లేవన్నారు. నజారా టెక్నాలజీస్ షేర్ల పతనం కొనసాగుతోంది. మూడు




రోజుల్లో ఇవి 17.52% మేర విలువను కోల్పోయాయి. ఈ కంపెనీకి చెందిన అసోసియేట్ సంస్థ మూన్‌షైన్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న 'పోకర్‌బాజీ' తన రియల్ మనీ ఆన్‌లైన్ గేమ్స్‌ను నిలిపేయడం ఇందుకు నేపథ్యం. అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధిస్తూ గురువారం పార్లమెంటు ఒక బిల్లుకు ఆమోదం తెలిపిన అనంతరం ఈ పరిణామం చోటు చేసుకుంది. 'ఆగస్టు 21, 2025న పార్లమెంటు ఆమోదించిన ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్, 2025 నేపథ్యంలో రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపేస్తున్న'ట్లు మూన్‌షైన్ టెక్నాలజీస్ ఒక ప్రకటనలో తెలిపింది. నజారాకు ఈ కంపెనీలో 46.07% వాటా ఉంది.

# గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీసు, మున్సిపల్ అధికారులు సమావేశం

- మల్కాజిగిరి సీఐ బి. సత్యనారాయణ
- ఏసిపి చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా,

మల్కాజిగిరి, ఆగస్టు 23 (తెలంగాణ ముచ్చట్లు):




మల్కాజిగిరి శుభం కన్వెన్షన్ హాల్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్కాజిగిరి సీఐ బి. సత్యనారాయణ, ఏసీపీ చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ జకియా సుల్తానా మాట్లాడుతూ శానిటేషన్, నీటి సరఫరా, లైటింగ్ తదితర సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా మున్సిపల్ శాఖ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ ప్రజల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు అధికారులు, నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సీఐ బి. సత్యనారాయణ మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నిమజ్జన కార్యక్రమాల్లో పోలీసులు ఇచ్చే సూచనలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు ముగ్గురూ ఒకే స్వరంతో పండుగ అనేది ఒక్క సమితి బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేస్తూ, ప్రజల సహకారంతో మల్కాజిగిరి గణపతి నవరాత్రులు శాంతియుతంగా, ఐక్యతతో ఘనంగా జరగనున్నాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏటీఎం కొత్త రూల్స్..



## ఇక ఒక్కో ట్రాన్సాక్షన్‌కి రూ.23 ఛార్జ్

బ్యాంకు ఖాతాదారులకు డెబిట్ కార్డు (ఏటీఎం) కార్డులు ఉంటాయి. నగదు అవసరమైనప్పుడు బ్యాంకుకు వెళ్లకుండా సమీపంలోని ఏటీఎం ద్వారా తీసుకుంటారు. ఇతర బ్యాంక్ ఏటీఎంలో సైతం నగదు తీసుకోవచ్చు.అయితే, ఇష్టం వచ్చినన్ని సార్లు నగదు విత్ డ్రా, బ్యాలెన్స్ ఎంక్వైరీ వంటి బ్యాంకింగ్ సేవలు ఉచితంగా వినియోగించుకునేందుకు లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త రూల్స్ ప్రకారం ఏటీఎం ఉచిత లావాదేవీల తర్వాత ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఒక్కో ట్రాన్సాక్షన్‌కి గరిష్ఠంగా రూ. 23 వరకు వసూలు చేయనున్నారు. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ఆర్‌బీఐ కొత్త రూల్స్ ప్రకారం హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఏటీఎం ద్వారా ఒక నెలలో 3 ట్రాన్సాక్షన్లు మాత్రమే ఉచితంగా నిర్వహించవచ్చు. ఇక నాన్ మెట్రో ప్రాంతాల్లో ఈ లిమిట్ 5గా ఉంది. ఈ లిమిట్ దాటితే పీఎన్‌బీ, హెచ్‌డీఎఫ్‌సీ వండి బ్యాంకులు ఛార్జీలు విధిస్తాయి. అయితే, ఎస్‌బీఐ పాత ఛార్జీలనే వసూలు చేస్తుండడం కాస్త ఊరట కల్పించే విషయం. చాలా బ్యాంకులు కొత్త ఛార్జీలకు మారిపోయాయి. ఉచిత పరిమితిలో క్యాష్ విత్ డ్రా సహా బ్యాలెన్స్ ఎంక్వైరీ, పిన్ మార్పు వంటి ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ లావాదేవీలు ఉంటాయి. అయితే, క్యాష్ రీసైక్లర్ మెషన్ ద్వారా నగదు జమ చేయడం అనేది ఉచితం. కానీ, ఏటీఎం ద్వారా నగదు ఉపసంహరణ అనేది లిమిట్ దాటితే ఛార్జీలు పడతాయి. ఇవి బ్యాంకును బట్టి మారుతుంటాయి. ఒకసారి మీరు లిమిట్ దాటిన తర్వాత ట్రాన్సాక్షన్ నిర్వహిస్తే అదనపు లావాదేవీలు ఒక్కో దానిపై రూ. 23 ప్లస్ జీఎస్‌టీ ఛార్జ్ చేస్తాయి బ్యాంకులు. ఉదాహరణకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో లిమిట్ దాటిన తర్వాత ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లు నిర్వహిస్తే రూ. 23 ఛార్జ్ పడుతుంది. నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లు అయితే రూ. 11 కట్టాల్సి వస్తుంది. ఏటీఎం నిబంధనలను పక్కనబెడితే బ్యాంక్ ఖాతాలో నగదు ట్రాన్సాక్షన్లకూ పరిమితి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక బ్యాంక్ ఖాతా నుంచి రూ. 20 లక్షలు ఆపైన డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా పాన్, ఆధార్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లావాదేవీల వివరాలు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం చేతికి వెళ్తాయి. నల్లధనాన్ని అరికట్టి బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఈ పరిమితిని విధించారు. అందుకే ఏటీఎం ద్వారా ట్రాన్సాక్షన్లు నిర్వహించేటప్పుడు జాగ్రత్త వహించాలి. తమ ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంలలోనే నగదు విత్ డ్రా చేయడం మంచిది. అదనపు ఛార్జీలు పడకుండా చూసుకోవాలి.

# ఎయిర్‌టెల్ యూజర్లకు సడెన్ సర్‌ప్రైజ్..




ఏకంగా 5 నెలలు ఉచితం

దిగ్గజ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ మరోసారి యూజర్ల కోసం బంపర్ ఆఫర్ ఒకటి తీసుకొచ్చింది. రీఛార్జ్‌తో కాల్స్, డేటాతో పాటుగా అదనపు బెనిఫిట్స్ కల్పిస్తోంది. అదనపు ఛార్జీలు లేకుండానే ఉచితంగా అందిస్తోంది. యాపిల్ భాగస్వామ్య ప్రయోజనాన్ని ఇప్పుడు ప్రీపెయిడ్ కస్టమర్లకు సైతం అందిస్తోంది. పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు అందించే ఈ బెనిఫిట్స్ ప్రీపెయిడ్ కస్టమర్లు ఉచితంగా పొందవచ్చు. 5 నెలలు ఉచితంగా యాపిల్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్ అందిస్తున్నట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. ఎయిర్ టెల్ ప్రీపెయిడ్ యూజర్లు ఈ బెనిఫిట్ ఈజీగానే పొందవచ్చు. మీ ఫోన్‌లోని ఎయిర్ టెల్ థ్యాంక్స్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులోకి వెళ్లాక యాపిల్ మ్యూజిక్ ఫ్రీ ఫర్ 5 మంత్స్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. ఆ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. దీంతో మీ నంబర్‌పై యాపిల్ ఫ్రీ మ్యూజిక్ ఆఫర్ యాక్టివేట్ అయిపోతుంది. ఈ 5 నెలల ఫ్రీ ట్రయల్ పూర్తయిన తర్వాత మీరు డీయాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. లేదంటే నెలకు రూ. 119 చొప్పు సబ్‌స్క్రిప్షన్ ఆటోరెన్యూవల్ అవుతుంది. మీకు తెలియకుండానే ఈ డబ్బులు కట్ అవుతుంటాయి. ఇప్పటికే చా[illegible]ంది ప్రీపెయిడ్ యూజర్లకు ఈ ఆఫర్ థ్యాంక్స్ యాప్‌లో కనిపిస్తోంది. ఖరీదైన ప్లాన్స్ ఉపయోగించే వారికి సైతం ఈ ఆఫర్ అందుబాటులో ఉంది. యాపిల్ మ్యూజిక్ వ్యక్తిగత ప్లాన్‌కు ధర ఒక నెలకు రూ. 99గా ఉంది. అదే ఫ్యామిలీ ప్లాన్ అయితే రూ. 149, స్టూడెంట్స్ ప్లాన్ రూ. 59 గా ఉంది. ఎయిర్‌టెల్ కొత్త ఆఫర్ ద్వారా ప్రీపెయిడ్ యూజర్లు ఆరు నెలల వరకు ఉచితంగా పొందవచ్చు. దీంతో సుమారు రూ. 600 వరకు ఆదా చేసిన వారు అవుతారు. యాపిల్ ప్రీమియం మ్యూజిక్ క్లెయిమ్ చేసుకుంటే యాడ్‌ఫ్రీ మ్యూజిక్ పొందవచ్చు. ప్రత్యేక ప్లేలిస్టులు, ఆఫ్‌లైన్ డౌన్ లోడ్స్, హైక్వాలిటీ సౌండ్స్ వంటి ప్రయోజనాలు పొందవచ్చు. ఎయిర్‌టెల్ ఇప్పటికే చాలా రకాల డిజిటల్ ఆఫర్లు అందుబాటులోకి తెచ్చింది.

# ప్రవాస పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ మృతి

దిగ్గజ ప్రవాస పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ (94) మరణించారు. బ్రిటన్‌లోని కపారో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడైన పాల్ ఆరోగ్యం ఇటీవల క్షీణించడంతో, లండన్‌లోని ఆసుపత్రిలో చేరారని, గురువారం సాయంత్రం ఆయన పరమపదించారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. పాల్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బ్రిటన్‌లో ఆయన చేపట్టిన ప్రజా సేవలు, దాతృత్వ కార్యకలాపాలను, భారత్‌తో బ్రిటన్ సంబంధాల విషయంలో ఆయనిచ్చిన మద్దతును జాతి ఎప్పటికీ గుర్తించుకుంటుందని అన్నారు. ఉక్కు ఉత్పత్తులు తయారు చేసే చిన్న ఫౌండ్రీని నిర్వహించే పైరే లాల్ దంపతులకు 1931 ఫిబ్రవరి 18న జన్మించిన పాల్ 1949లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ, అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎమ్ఐటీ) నుంచి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీలు చేశారు. అనంతరం భారత్‌కు వచ్చి కుటుంబ వ్యాపార సంస్థ అయిన అపీజే సరెండ్రా గ్రూప్‌లో చేరారు. కుమార్తెకు లుకేమియాతో: లుకేమియాతో బాధపడుతున్న తన కూతురు అంబికకు చికిత్స చేయించే నిమిత్తం 1966లో బ్రిటన్‌కు పాల్ మకాం మార్చారు. 1968లో కపారో గ్రూప్‌ను స్థాపించారు. దురదృష్టవశాత్తు నాలుగేళ్ల వయసులోనే అంబిక మరణించింది. తదుపరి ఆమె పేరిట అంబికా పాల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసి లక్షల మంది పిల్లలు, యువతకు విద్య, ఆరోగ్య సేవలను అందించారు. లండన్‌లో అంబికా పాల్ చిల్డ్రన్స్ జూ కూడా స్థాపించారు. 2015లో కుమారుడు అంగద్, 2022లో సతీమణి అరుణ దూరమైనపుడు కూడా ఆయన దాతృత్వ కార్యకలాపాలు భారీఎత్తున చేపట్టారు. 2 బిలియన్ పౌండ్ల సంపదతో ఈ ఏడాది 'సండే టైమ్స్ రిచ్ లిస్ట్'లో ఆయన 81వ స్థానంలో నిలిచారు. కపారో



ఇండియా ఛైర్మన్‌గా పాల్ కుమారుడు ఆకాశ్ పాల్ ఉన్నారు.



# ఓనమ్‌కు డబుల్ పింఛన్

తిరువనంతపురం: కేరళలో ఓనమ్ పండుగ సందర్భంగా అక్కడి సామాజిక, సంక్షేమ పథక లబ్ధిదారులకు విజయన్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. లబ్ధిదారులకు రెండు ఇన్‌స్టాల్‌మెంట్ల పింఛన్‌ను అందించనున్నది. ఈ మేరకు రూ.1679 కోట్లను మంజూరు చేసినట్టు రాష్ట్ర ఆర్థిక మంత్రి కె.ఎన్ బాలగోపాల్ ప్రకటించారు. దీంతో ఓనమ్ పండుగ సందర్భంగా దాదాపు 62 లక్షల మంది లబ్ధిదారులు రూ.3200 చొప్పున అందుకోనున్నారు. లబ్ధిదారులకు ఆగస్టు పింఛన్‌తో పాటు అదనంగా ఇంకో ఇన్‌స్టాల్‌మెంట్ అందనున్నది. ప్రతిష్టాత్మక ఓనం పండుగ సమయంలో పెన్షనర్లకు ఆర్థిక సహాయాన్ని అందించటం కోసం కేరళ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. లబ్ధిదారులకు ఈ నగదు శనివారం నుంచి అందనున్నది. 26.62 లక్షల మంది బ్యాంకు ఖాతాల్లో పెన్షన్లు క్రెడిట్ కానున్నాయి. మిగతావారికి సహకార బ్యాంకుల ద్వారా వారి ఇంటికే పెన్షన్ చేరుతుంది. ఇక జాతీయ పెన్షన్ పథకం కింద 8.46 లక్షల మంది కోసం కేంద్రం తన షేర్‌ను కేటాయించాల్సి ఉన్నది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే రూ.48.42 కోట్లను మంజూరు చేసింది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వ పీఎంఎఫ్ఎస్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ కానున్నది. కాగా కేరళ సర్కారు నిర్ణయంపై అక్కడి ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# మునగ గింజలలో దాగున్న ఆరోగ్య రహస్యాలు

మునగ ఆకులు వాటి లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. కానీ మునగకాయల్లోని చిన్న విత్తనాలు కూడా తక్కువేమీ కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఈ విత్తనాలు మునగ కాయల నుండి వస్తాయి. శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ఉపయోగించబడుతున్నాయి. ఈ విత్తనాలలో పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు, శక్తివంతమైన మొక్కల సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మునగ గింజలు ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్, విటమిన్ సి వంటి యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. మన శరీర కణాలను వృద్ధాప్యం, వ్యాధుల నుండి రక్షిస్తాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంట తగ్గుతుంది. శరీర రోగనిరోధక శక్తి బలపడుతుంది. మునగ గింజలు శరీరంలో ఇన్సులిన్ లాగా పనిచేసే సమ్మేళనాలతో నిండి ఉన్నాయని, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుందని అనేక అధ్యయనాలు చూపించాయి. ఇది ముఖ్యంగా మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మునగ గింజలు మెగ్నీషియం, జింక్, ఇనుము, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలు, కండరాలు, నరాల పనితీరుకు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలకు చాలా ముఖ్యమైనవి. మునగ గింజలలో జింక్, విటమిన్ సి కనిపిస్తాయి. ఇవి మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. తరచుగా వచ్చే వ్యాధుల నుండి మనల్ని రక్షిస్తాయి. ఫైబర్ అధికంగా ఉండే మునగ గింజలు జీర్ణక్రియకు సహాయపడతాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. ఈ విత్తనాలు ఒమేగా3, ఒమేగా9 కొవ్వు ఆమ్లాలను అందిస్తాయి. ఇవి చర్మాన్ని తేమగా ఉంచుతాయి. ముడతలను తగ్గిస్తాయి. జుట్టును బలపరుస్తాయి. మునగ గింజల నూనెలో అద్భుతమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను ప్రోత్సహిస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ విత్తనాలు మెదడు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను ఇనుము, జింక్‌ను అందిస్తాయి. దీంతోపాటుగా జ్ఞాపకశక్తి, నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

# నిమ్మకాయ ముక్కను ఫ్రిజ్‌లో పెడితే ఏమవుతుంది?



నిమ్మకాయంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందం నుంచి ఆరోగ్యం వరకు దీనిని వివిధ రూపాలలో ఉపయోగిస్తారు. నాన్ వెజ్ ఉందంటే నిమ్మకాయ ఉండాల్సిందే. నిమ్మకాయ కేవలం ఆహార పదార్థాలలో రుచిని పెంచడానికి మాత్రమే కాదు.. ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా నిమ్మకాయను కోసి ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల కొన్ని అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని యాంటీ బాక్టీరియల్, సిట్రిక్ యాసిడ్ లక్షణాలు ఫ్రిజ్‌ను శుభ్రంగా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఫ్రిజ్‌ను ఎంత శుభ్రంగా ఉంచినా కొన్నిసార్లు అందులో దుర్వాసన రావడం సాధారణం. ఇలాంటి సందర్భాలలో ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కట్ చేసి రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే ఆ దుర్వాసన తొలగిపోతుంది. నిమ్మకాయలోని సిట్రిక్ యాసిడ్ చెడు వాసనను పీల్చుకుని, ఫ్రిజ్‌లో తాజా సువాసన ఉండేలా చేస్తుంది. ఫ్రిజ్‌లో ఉంచిన కొన్ని ఆహార పదార్థాలు త్వరగా చెడిపోతుంటాయి. ఈ సమస్యను నివారించడానికి నిమ్మకాయ ముక్కలను ఉపయోగించవచ్చు. నిమ్మకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆహార పదార్థాలు త్వరగా చెడిపోకుండా కాపాడతాయి. అయితే ఈ ప్రయోజనం కోసం ఎప్పుడూ తాజా, శుభ్రమైన నిమ్మకాయ ముక్కలను మాత్రమే ఉపయోగించడం మంచిది. నిమ్మకాయ ముక్కలను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల కలిగే మరో ప్రయోజనం, ఇది ఫ్రిజ్‌లోని గాలిని సహజంగా శుద్ధి చేస్తుంది. నిమ్మకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సిట్రిక్ యాసిడ్ ఫ్రిజ్‌లోని గాలిని తాజాగా ఉంచుతాయి. దీనివల్ల ఫ్రిజ్‌లో ఉండే బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్ల ప్రమాదం కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది మన ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా సహాయపడుతుంది.

# ఆవు పాలు, బర్రె పాలు.. ఆరోగ్యానికి ఏది మంచిది?



మన రోజువారీ ఆహారంలో పాలు ఒక ముఖ్యమైన భాగం. అయితే ఆవు పాలు తాగాలా లేక గేదె పాలు తాగాలా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఈ రెండు రకాల పాలకు వాటి సొంత ప్రయోజనాలు ఉన్నాయి. కానీ అవి మన శరీరంపై చూపించే ప్రభావాలు వేర్వేరుగా ఉంటాయి. ముఖ్యంగా జీర్ణక్రియ, మూత్రపిండాల ఆరోగ్యానికి సంబంధించి ఏది మంచిదో తెలుసుకోవడం ముఖ్యం. ఆవు పాలు: గేదె పాలతో పోలిస్తే ఆవు పాలలో కొవ్వు, ప్రోటీన్ తక్కువగా ఉంటాయి. అందుకే అవి తేలికగా ఉండి.. సులభంగా జీర్ణమవుతాయి. ఆవు పాలలో విటమిన్ ఎ కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలు, కంటి ఆరోగ్యానికి చాలా మంచివి. గేదె పాలు: గేదె పాలలో కొవ్వు, ప్రోటీన్ అధికంగా ఉంటాయి. అందుకే అవి మరింత క్రీమీగా, చిక్కగా ఉంటాయి. దీనిని జీర్ణం చేయడం కొంచెం కష్టం. అయితే శక్తి, కండరాల నిర్మాణానికి ఎక్కువ ప్రోటీన్ అవసరమయ్యే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. మూత్రపిండాలకు: గేదె పాలలో అధిక ప్రోటీన్ కంటెంట్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. ఇది ఇప్పటికే బలహీనంగా ఉన్న మూత్రపిండాలకు మరింత హాని కలిగించవచ్చు. అయితే ఆవు పాలు తేలికగా ఉండటం వల్ల మూత్రపిండాలపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. అందుకే వైద్యులు కిడ్నీ రోగులకు ఆవు పాలు తాగమని ఎక్కువగా సిఫార్సు చేస్తారు. జీర్ణక్రియకు: పాలు తాగిన తర్వాత బరువుగా అనిపించడం, గ్యాస్ లేదా అజీర్తి వంటి సమస్యలు ఉన్నవారికి ఆవు పాలు మంచి ఎంపిక. ఇది త్వరగా జీర్ణమవుతుంది. మీరు ఆరోగ్యంగా ఉండి, జీర్ణ సమస్యలు లేకపోతే గేదె పాలు కూడా తాగవచ్చు.



# కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయా..?


వర్షా కాలం, చలి కాలంలో చాలామందిని వేధించే ప్రధాన సమస్య కీళ్ల నొప్పులు. వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రత మార్పుల కారణంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వ్యాయామం: తేలికపాటి వ్యాయామం, యోగా, స్ట్రెచింగ్ వంటివి కీళ్ల కదలికను మెరుగుపరుస్తాయి. రక్త ప్రసరణను పెంచుతాయి. అయితే వ్యాయామం చేసేటప్పుడు తేమతో కూడిన ప్రదేశాలకు దూరంగా ఉండటం మంచిది. కీళ్లను చలి నుంచి రక్షించడం చాలా ముఖ్యం. మోకాళ్లు, నడుము భాగాలను వెచ్చని దుస్తులతో కప్పి ఉంచండి. అలాగే, తడి బట్టలు, బూట్లు, చెప్పులు ఎక్కువసేపు ధరించకుండా ఉండండి. సరైన ఆహారం: మీ ఆహారంలో పసుపు, అల్లం, తాజా పండ్లు చేర్చుకోండి. ఇవి సహజసిద్ధంగా మంటను తగ్గిస్తాయి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే అవిసె గింజలు, వాల్‌నట్‌లు, చేపలు తినడం వల్ల వాపు తగ్గుతుంది. ఉప్పు ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం కూడా చాలా ముఖ్యం. వర్షా కాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల శరీరంలో విటమిన్ డి స్థాయిలు తగ్గుతాయి. కాబట్టి, పాలు, పనీర్, ఆకుకూరలు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం అవసరం. సరైన భంగిమ: ఒకే చోట ఎక్కువసేపు కూర్చోవడం కీళ్లపై ఒత్తిడిని పెంచుతుంది. ప్రతి 45 నిమిషాలకు లేచి కాసేపు అటూ ఇటూ తిరగండి. కూర్చున్నప్పుడు సరైన భంగిమలో కూర్చోవడం కూడా అవసరం. వర్షా కాలంలో తడి ప్రదేశాల్లో జారిపడి గాయాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి యాంటీ-స్లిప్ బూట్లు ధరించడం మరియు తడి నేలలపై జాగ్రత్తగా నడవడం చాలా ముఖ్యం. బరువు నియంత్రణ: అధిక బరువు కీళ్లపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. కొద్దిగా బరువు తగ్గినా నొప్పి గణనీయంగా తగ్గుతుంది. తగినంత నీరు త్రాగడం వల్ల కీళ్లలోని ద్రవాలు గట్టిపడకుండా ఉంటాయి. ఇది కీళ్ల కదలికను సులభతరం చేస్తుంది. ఈ చిట్కాలను పాటించడం ద్వారా కీళ్ల నొప్పుల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# రోజుకో ఖర్జూరం పండు తింటే..

డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివి. అందుకే వీటిని ఎక్కువగా ఆహారంలో భాగంగా తీసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. ముఖ్యంగా ఖర్జూరాలు శరీరానికి చాలా మంచివి. ఖర్జూరాలు.. ప్రకృతి సహజంగా లభించే తీపి పదార్థం. అంతేకాదు, ఇది పోషక విలువలకు నిలయం కూడా. రోజూ ఓ ఖర్జూరం తినడం వల్ల శరీరంలో ఎన్నో సానుకూల మార్పులు వస్తాయని నిపుణులు అంటున్నారు. ఇది అనేక రకాల ఆరోగ్య సమస్యలకు దివ్యౌషధంగా కూడా పనిచేస్తుంది. ఖర్జూరంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది కడుపును శుభ్రపరచడానికి, మలబద్ధకం సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అంతేకాకంఉడా ఆర్థరైటిస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఖర్జూరాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఖర్జూరంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ బి6, ఐరన్ శరీరాన్ని వివిధ వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఖర్జూరాలు శరీరంలో రక్త ఉత్పత్తిని మెరుగుపరుస్తాయి. అవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా సహాయపడతాయి. అందువల్ల ప్రతిరోజూ ఓ ఖర్జూరం పండు తినడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు, శక్తి లభిస్తాయి. ఖర్జూరంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఖర్జూరంలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ మూలకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయి. వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడతాయి. ఖర్జూరంలో లభించే కాల్షియం ఎముకలను బలపరుస్తుంది.




# థైరాయిడ్ రావడానికి ముఖ్యకారణం..



థైరాయిడ్ అనేది రెండు రకాలు. హైపో థైరాయిడిజం, తక్కువ హార్మోన్ ఉత్పత్తి చేస్తుంది. హైపర్ థైరాయిడిజం. ఇది ఎక్కువ హార్మోన్స్ ఉత్పత్తి చేస్తుంది. ఈ సమస్య పరుషులతో పోలిస్తే మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది.కాగా, దీనికి గల ముఖ్య కారణాలు ఏవో ఇప్పుడు తెలుసుకుందాం. మహిళల్లో థైరాయిడ్ సమస్యల కు ముఖ్య కారణం ఆటో ఇమ్యూన్ వ్యాధులు. ఒకటి హషిమోటోస్ థైరాయిడిటిస్, గ్రేవ్స్ వ్యాధి. ఈ రెండు రోగనిరోధక వ్యవస్థ థైరాయిడ్ గ్రంథిని హార్మోన్ల ఉత్పత్తి తగ్గించడం , పెంచడం వలన థైరాయిడ్ సమస్య అనేది వస్తుందంట. ఇక ఇదే కాకుండా ప్రెగ్నెంట్ సమయంలో కూడా చాలా మంది థైరాయిడ్ సమస్య బారిన పడతారు. హార్మోన్లలో మార్పుల వలన థైరాయిడ్ సమస్య వస్తుంది. అయితే ఇది కొందరిలో కొన్ని నెలల వరకే ఉండి తగ్గిపోతుంది. కానీ కొంత మందిలో మాత్రం శాశ్వతంగా ఉండిపోతుందంట. అలాగే, అయోడిన్ లోపం లే దా అయోడిన్ అధికంగా ఉండటం వలన కూడా థైరాయిడ్ సమస్య వస్తుందంట. కొంత మందిలో దీర్ఘకాలిక ఒత్తిడి థైరాయిడ్ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అంతే కాకుండా కొన్నిరకాల మందులు కూడా థైరాయిడ్ పనితీరును ప్రభావితం చేస్తాయంట. ఇవే కాకుండా యవ్వనం, మోనోపాజ్ సమయంలో వచ్చే హార్మోన్ల మార్పుల వలన కూడా థైరాయిడ్ సమస్య రావచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు


# గుమ్మడి ఆకులతో మస్త్ ఆరోగ్యం..!



అన్ని రకాల పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, మనం గుమ్మడికాయ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే.. గుమ్మడి దాని గుణాల కారణంగా ఆరోగ్య నిధి అంటారు. ఇది మాత్రమే కాదు, ఆయుర్వేదంలో గుమ్మడికాయను మంచి ఔషధంగా కూడా వర్ణించారు. కానీ గుమ్మడికాయ, దాని గింజలతో పాటుగా దాని ఆకులు కూడా తింటారని, అవి రుచిలో, ఆరోగ్య పరంగా కూడా ప్రయోజనకరంగా ఉంటాయని మీకు తెలుసా. గుమ్మడికాయ ఆకులు ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. మీరు నిరంతరం మలబద్ధకంతో బాధపడుతుంటే గుమ్మడికాయ ఆకులు ఉపశమనం కలిగిస్తాయి. గుమ్మడికాయ ఆకులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు దీన్ని ప్రతిరోజూ తీసుకుంటే మలబద్ధకం నుండి మీకు తక్షణ ఉపశమనం లభిస్తుంది. ఇది మాత్రమే కాదు ఇది కడుపుని క్లియర్ చేయడానికి కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గుమ్మడికాయ ఆకులు గుండె సమస్య గ్యాస్ట్రిక్ సమస్యను నివారిస్తుంది. గుమ్మడికాయ ఆకులలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇందులో భాస్వరం కూడా ఉంటుంది. ఇది మీ ఎముకలను బలపరుస్తుంది. దంతాల అభివృద్ధిలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మీరు దీన్ని ప్రతిరోజూ తీసుకుంటే, కీళ్ల నొప్పులు, అలసట నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. గుమ్మడికాయ ఆకులలో మంచి మొత్తంలో ఇనుము కూడా ఉంటుంది. ఇది రక్తహీనతను నయం చేస్తుంది. ఋతుస్రావ సమయంలో కడుపు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మీరు ఋతుస్రావ సమయంలో కూడా దీనిని తినవచ్చు. గుమ్మడికాయ ఆకులలో చిన్నగా కరిగే ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది మీ ప్రేగులలో ఆమ్లం ఏర్పడే ప్రక్రియను ఆపడానికి పనిచేస్తుంది. ఇది రక్త కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. దీనిలో ఉండే ఫైబర్ గుండె జబ్బులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యూఎస్‌లో విదేశీయులపై డేగకన్ను.. 5.5కోట్ల మంది వీసాల వడపోత



అమెరికాలో విదేశీయులపై వేటు వేసేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైంది. అమెరికాలో చెల్లుబాటు అయ్యే సుమారు 5.5కోట్ల మంది వీసాలను బహిష్కరణ నేరాల కోసం పరిశీలిస్తున్నామని ట్రంప్ యంత్రాంగం గురువారం తెలిపింది. వీసా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని దేశం నుండి బహిష్కరించనున్నట్లు పేర్కొంది. పలు దేశాలకు చెందిన పర్యాటకులు సహా యుఎస్ వీసా కలిగిన వారందరూ 'నిరంతరం పర్యవేక్షణ'కు లోబడి ఉంటారని, వారు అమెరికాలోకి ప్రవేశించడానికి లేదా నివసించేందుకు అనుమతి పొందేందుకు అర్హులనే సంకేతాలను దృష్టిలో ఉంచుకుని ఉంటారని స్టేట్ డిపార్ట్‌మెంట్ మీడియా ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో తెలిపింది. నేర కార్యకలాపాలు, ప్రజా భద్రతకు ముప్పు, ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనడం, లేదా ఉగ్రవాద సంస్థకు మద్దతు ఇవ్వడం వంటి సమాచారం వెల్లడైతే.. ఆ వ్యక్తులపై అనర్హత వేటు వేయనున్నట్లు ఆ విభాగం తెలిపింది. అటువంటి సమాచారం దొరికితే వీసా రద్దు చేయబడుతుందని, వారు అమెరికాలోనే ఉంటే బహిష్కరణకు గురవుతారని పేర్కొంది. వారిపై విస్తృత పర్యవేక్షణ ఉంటుందని, అమెరికాలో ఉండేందుకు అనుమతి పొందిన వారిని సైతం అకస్మాత్తుగా దేశం నుండి బహిష్కరించవచ్చని విదేశాంగ సూచించింది. తమ పరిశీలనలో భాగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్నంతటినీ సమీక్షిస్తామని, చట్ట అమలు లేదా ఇమ్మిగ్రేషన్ రికార్డులు లేదా వీసా జారీ అనంతరం వెలుగులోకి వచ్చిన ఇతర సమాచారాన్ని అనర్హత కోసం వినియోగించవచ్చని తెలిపింది. వాణిజ్య ట్రక్ డ్రైవర్లకు వర్కర్ వీసాలు జారీ చేయడం కూడా అమెరికా నిలిపివేస్తుందని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో గురువారం తెలిపారు. ఈ మార్పు వెంటనే అమల్లోకి వస్తుందని అన్నారు. అయితే అమెరికాలో ఎంతమంది విదేశీ ట్రక్ డ్రైవర్లు ఉన్నారన్న ప్రశ్నకు ఆ విభాగం స్పందించలేదు.

# పోలీసు హెలికాప్టర్‌పై దాడి.. 17 మంది మృతి




కొలంబియా దేశంలో రెండు భయానక ఘటనలు చోటుచేసుకున్నాయి. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) రెండు వేర్వేరు ఉగ్రదాడులు జరగడంతో 17 మంది మరణించారు. అంతియోక్వియా ప్రాంతంలో కొకైన్ ఉత్పత్తికి ఉపయోగించే కోకా మొక్కల సాగును తొలగించే కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఈ హెలికాప్టర్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్‌తో మొదటి దాడికి పాల్పడ్డారు. ఈ దాడి హెలికాప్టర్‌లో భారీగా మంటలు చెలరేగేలా చేసింది. ఇక ఈ ఘటనలో 12 మంది పోలీసు అధికారులు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారని అక్కడి అధికారులు వెల్లడిరచారు. ఈ దాడి ఇటీవల జరిగిన కోకైన్ పట్టివేతకు ప్రతీకార చర్యగా జరిగినట్లుగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండో దాడి కాలి నగరంలో మిలిటరీ ఏవియేషన్ స్కూల్ సమీపంలో జరిగింది. కారు బాంబు పేలడంతో ఐదుగురు మరణించగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ రెండు ఘటనలకు కారణంగా దేశవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ దాడులకు మాజీ వామపక్ష ఉగ్రవాద సంస్థ అయిన ఫార్క్‌లోని విపక్ష గ్రూపులు బాధ్యత వహించాయని తెలిపారు. ఈ మేరకు కారు బాంబు పేలిన ప్రాంతంలో ఒక నిందితుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# భారత్‌కు కొత్త అమెరికా రాయబారిగా సెర్గియో గోర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు తదుపరి అమెరికా రాయబారిగా తన ఆప్తమిత్రుడు, వైట్‌హౌస్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్ సెర్గియో గోర్‌ను నియమిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈయనకు అదనంగా దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక రాయబారిగా కూడా బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం ద్వారా ఇరు దేశాల మధ్య సంబంధాలలో ఒక కొత్త అధ్యాయం మొదలుకానుంది.ఈ విషయాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా వెల్లడిరచారు. భారత్‌లో మా తదుపరి రాయబారిగా సెర్గియో గోర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను'' అని ఆయన పేర్కొన్నారు. సెర్గియో, ఆయన బృందం రికార్డు సమయంలో దాదాపు 4,000 మంది తమను తాము దేశభక్తులుగా భావించుకునే వారిని ప్రభుత్వంలోని అన్ని విభాగాలలో నియమించారని ట్రంప్ ప్రశంసించారు. ప్రస్తుతం మా ప్రభుత్వ విభాగాలు, ఏజెన్సీల్లో 95 శాతం పైగా ఉద్యోగులతో నిండిపోయాయని తెలిపారు.సెర్గియో తన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ, బెస్ట్ సెల్లింగ్ పుస్తకాల ప్రచురణలోనూ, ట్రంప్ అనుకూల సూపర్ పీఏసీని నడపడంలోనూ కీలక పాత్ర పోషించారని ట్రంప్ గుర్తుచేశారు. ఆయన నియామకం సెనేట్‌లో ఖరారయ్యే వరకు ప్రస్తుత పదవిలో కొనసాగుతారని స్పష్టం చేశారు.ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న ప్రాంతానికి తన ఎజెండాను ముందుకు తీసుకెళ్లగల పూర్తి నమ్మకస్తుడైన వ్యక్తి అవసరమని ట్రంప్ అన్నారు. ''సెర్గియో ఒక అద్భుతమైన రాయబారి అవుతారు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ లక్ష్యానికి ఆయన ఎంతగానో సాయపడతారు. సెర్గియోకు అభినందనలు'' అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, రష్యాతో వాణిజ్య సంబంధాల కారణంగా అమెరికా భారత్‌పై 25 శాతం పరస్పర సుంకాలతో పాటు అదనపు టారిఫ్‌లు విధించిన సున్నితమైన తరుణంలో ఈ నియామకం జరగడం గమనార్హం.

# గాజా నగరాన్ని నాశనం చేస్తాం: ఇజ్రాయిల్ రక్షణ మంత్రి

గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయిల్ బెదిరింపులకు దిగింది. గాజాపై అమానుషంగా దాడులకు తెగబడుతూ, సాయన్ని కూడా నిలిపివేసిన ఇజ్రాయిల్.. గాజాను పూర్తిగా ఆక్రమించుకునేందుకు దాడులను ఉధృతం చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. హమాస్ నిరాయుధీకరణకు అంగీకరించకపోతే, ఆ భూభాగంలో మిగిలిన బందీలను విడుదల చేయకుంటే, ఇజ్రాయిల్ షరతులకు లోబడి యుద్ధాన్ని ముగించకుంటే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. ''బందీలను విడుదల చేయడం , నిరాయుధీకరణ వంటి ఇజ్రాయిల్ షరతులకు అంగీకరించి యుద్ధాన్ని ముగించకుంటే.. త్వరలో గాజాలో హమాస్ హంతకులు, రేపిస్టుల తలలపై నరకం ద్వారాలు తెరుచుకుంటాయి'' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో తీవ్రంగా ధ్వంసమైన రెండు నగరాలను ప్రస్తావిస్తూ.. ''హమాస్ అంగీకరించకపోతే వారి రాజధాని గాజా, రఫా మరియు బీట్ హనౌన్‌ల్లాగా మారుతుంది'' అని బెదిరింపులకు దిగారు. గాజాలో మిగిలిన బందీలందరినీ విడిపించే లక్ష్యంతో తక్షణ చర్యలకు ఆదేశించినట్లు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ గురువారం రాత్రి వెల్లడిరచిన అనంతరం ఈ ప్రకటన వెలువడిరది. గాజాను తమ ఆధీనంలోకి తీసుకుని, హమాస్ స్థావరాన్ని నాశనం చేసే ఆపరేషన్‌తో పాటు బందీలను విడుదల చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. ఈ వారం ప్రారంభంలో గాజాను ఆక్రమించుకునేందుకు సుమారు 60,000 మంది రిజర్వ్ సైనికులను మోహరించేందుకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది.

# 50 గంటల జైలుకే ఉద్యోగం ఊడితే 30 రోజుల జైలుకు పదవి పోవద్దా?




న్యూఢిల్లీ : ప్రధాని, ముఖ్యమంత్రులతో సహా ఎవరైనా అరెస్ట్ అయి 30 రోజులు జైలులో ఉంటే వారిని తొలగించేందుకు ప్రతిపాదించిన రాజ్యాంగం 130వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష నాయకులపై ప్రధాని మోడీ తీవ్రంగా విమర్శలు చేశారు. బెయిల్ మీద బయటకు వచ్చిన వారే ఈ బిల్లును ప్రధానంగా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. అరెస్ట్ అయి జైలులో ఉండి అధికార ఫైళ్లపై సంతకం చేసిన ఓ సీఎం, బెయిల్ పై జైలు నుంచి బయటపడి తాను రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నానని విమర్శిస్తున్న మరో నాయకుడు, రైల్ కా ఖేల్ లో పాల్గొన్న మరో నాయకుడు.. వీళ్లే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారని మోడీ విమర్శిస్తూ, అరవింద్ కేజ్రీవాల్,రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌లను పరోక్షంగా నిందించారు. బీహార్‌లోని గయలో శుక్రవారంనాడు నిర్వహించిన భారీ బహిరంగసభలో ప్రధాని ప్రసంగించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు నెల రోజుల పాటు జైలులో ఉండే సిఎం, పిఎం, మంత్రులు ఎందుకు పదవిని కోల్పోకుండా ఉండాలని మోడీ ప్రశ్నించారు. అవినీతికి వ్యతిరేకంగా ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని మోడీ అన్నారు. చివరకు ప్రధాని కూడా ఆ చట్టం పరిధిలోకి వస్తున్నారని గుర్తు చేశారు. కొత్త బిల్లు ప్రకారం ఎవరైనా అధికారపదవిలో ఉండి, అరెస్ట్ అయి 30 రోజులు జైలులో ఉంటే, బెయిల్ పొందలేకపోతే , వారు 31 వ రోజున రాజీనామా చేయవలసి ఉంటుందని, లేని పక్షంలో తొలగించబడతారని ప్రధాని వివరించారు. రాజకీయాల్లో నైతికత పెంచే ఈ చట్టం ప్రధానికి కూడా వర్తిస్తుందని ఆయన గుర్తు చేశారు.

# అమెరికాలోని న్యూయార్క్‌లో అదుపుతప్పిన టూర్ బస్సు

అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూర్ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.బాధితుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. 50 మందికి పైగా ప్రయాణికులతో ఓ టూర్ బస్సు నయాగరా జలపాతం పర్యటన ముగించుకుని న్యూయార్క్ నగరానికి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటల అక్కడి స్థానిక కాలమానం ప్రకారం సమయంలో బఫెలో, రోచెస్టర్ నగరాల మధ్య ఇంటర్‌స్టేట్ 90 రహదారిపై బస్సు అదుపుతప్పింది. వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లోకి దూసుకెళ్లి, ఆపై పక్కకు బోల్తా పడిరది.ఈ ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జు కాగా, కొందరు ప్రయాణికులు వాహనం నుంచి బయటకు ఎగిరిపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీశాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించాయి. బాధితుల్లో అమెరికాతో పాటు భారత్, చైనా, ఫిలిప్పీన్స్, మధ్యప్రాచ్య దేశాలకు చెందిన వారు ఉన్నారని న్యూయార్క్ స్టేట్ పోలీస్ మేజర్ ఆండ్రీ రే తెలిపారు. వేర్వేరు భాషల వారికి సహాయం చేసేందుకు ప్రత్యేకంగా అనువాదకులను ఘటనా స్థలానికి రప్పించారు.ప్రమాదానికి డ్రైవర్ పరధ్యానమే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ''డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి, దాన్ని సరిదిద్దే ప్రయత్నంలో బస్సు బోల్తా పడిరదని భావిస్తున్నాం'' అని పోలీస్ అధికారులు వెల్లడిరచారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్‌ను పోలీసులు విచారిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌కు ఊరట



న్యూఢిల్లీ: ది వైర్ ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్, సీనియర్ జర్నలిస్ట్ కరణ్ థాపర్‌లకు అత్యున్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. అరెస్టుల నుంచి వారికి రక్షణ కల్పించింది. అసోం పోలీసులు అరెస్టు, ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ 152 కింద నమోదు చేసి ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్‌ఐఆర్)కు సంబంధించి క్రైమ్ బ్రాంచ్ జారీ చేసిన సమన్లను సవాలు చేస్తూ వరదరాజన్, కరణ్ థాపర్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోరుమల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది నిత్య రామకృష్ణన్ వాదనలు వినిపిస్తూ ఎఫ్‌ఐఆర్ మే నెల నాటిదని, మరొక కేసులో సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన వెంటనే దీనిని ప్రయోగించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడానికి మొగ్గు చూపుతున్నట్టు కనిపిస్తోందని, దీనివల్ల అరెస్టు జరుగుతుందనే నిజమైన భయం ఏర్పడుతుందని వాదించారు. కేసును పరిశీలించిన తరువాత ధర్మాసనం జర్నలిస్టులకు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. అయితే వారిపై నమోదైన కేసుల దర్యాప్తునకు సహకరించాలని, వారిపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని సూచించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ 15కి వాయిదా వేసింది. అసోం పోలీసులు నమోదు చేసిన సెక్షన్ 152 ఎఫ్‌ఐఆర్‌లో సుప్రీంకోర్టు ది వైర్‌కు ఉపశమనం ఇచ్చిన కొద్ది రోజులకే అస్సాం పోలీసులు ఈ సమన్లు జారీ చేయడం గమనార్హం.




# భారత సొంత స్పేస్ స్టేషన్ నమూనాను ఆవిష్కరించిన ఇస్రో

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో భారత్ మరో చారిత్రక ఘట్టానికి నాంది పలికింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' (బీఏఎస్) ఏర్పాటు దిశగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కీలక ముందడుగు వేసింది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో ఈ ప్రతిష్ఠాత్మక స్పేస్ స్టేషన్ మాడ్యూల్ నమూనాను తొలిసారిగా ఆవిష్కరించింది.ఈ ప్రాజెక్టు పూర్తయితే, ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్), చైనాకు చెందిన తియాంగాంగ్ తర్వాత సొంతంగా అంతరిక్షంలో పరిశోధనా కేంద్రాన్ని నిర్మించుకున్న దేశంగా భారత్ చరిత్ర సృష్టిస్తుంది. ఇస్రో ప్రణాళికల ప్రకారం, 2028 నాటికి తొలి మాడ్యూల్ (బీఏఎస్-01) ను ప్రయోగించనున్నారు. ఆ తర్వాత దశలవారీగా విస్తరించి, 2035 నాటికి మొత్తం ఐదు మాడ్యూళ్లతో పూర్తిస్థాయి అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆవిష్కరించిన మొదటి మాడ్యూల్ బీఏఎస్-01 దాదాపు 10 టన్నుల బరువు ఉంటుంది. ఇది భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో పరిభ్రమించనుంది. ఇందులో పర్యావరణ నియంత్రణ, జీవనాధార వ్యవస్థ, భారత్ డాకింగ్ సిస్టమ్, ఆటోమేటెడ్ హ్యాచ్ సిస్టమ్ వంటి అత్యాధునిక, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వ్యవస్థలు ఉన్నాయి.ఈ స్పేస్ స్టేషన్ ప్రధానంగా సూక్ష్మ గురుత్వాకర్షణపై (మైక్రోగ్రావిటీ) పరిశోధనలకు వేదికగా నిలవనుంది. అంతరిక్ష శాస్త్రాలు, జీవశాస్త్రాలు, వైద్యం వంటి రంగాల్లో కీలక ప్రయోగాలకు ఇది దోహదపడుతుంది.ముఖ్యంగా, సూక్ష్మ గురుత్వాకర్షణ మానవ ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అధ్యయనం చేయడానికి, భవిష్యత్తులో చేపట్టబోయే సుదీర్ఘ అంతరిక్ష యాత్రలకు అవసరమైన టెక్నాలజీలను పరీక్షించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంధనాన్ని నింపుకోవడం, రేడియేషన్, అంతరిక్ష శిథిలాల నుంచి రక్షణ కల్పించడం, వ్యోమగాములు స్పేస్‌వాక్ చేసేందుకు వీలు కల్పించడం వంటి అనేక కీలక సామర్థ్యాలను ఈ కేంద్రం కలిగి ఉంటుంది.

# శ్రీలంక మాజీ అధ్యక్షుడు అరెస్ట్



శ్రీలంగ మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను శుక్రవారం నాడు శ్రీలంక సీఐడీ అరెస్ట్ చేసింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణపై ఆయనను అరెస్ట్ చేసినట్లు స్థానిక టెలివిజన్ తెలిపింది. 76 ఏళ్ల విక్రమసింఘే రాజధాని కొలంబోలోని సీఐడీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ అరెస్ట్ జరిగింది. తన భార్య స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు లండన్ కు వెళ్లిన విషయంపై దర్యాప్తులో భాగంగా స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు ఆయన సీఐడీ కార్యాలయానికి వెళ్లారని టెలివిజన్ రిపోర్ట్ లో తెలిపారు. ఈ అరెస్ట్ పై శ్రీలంక పోలీసులు వెంటనే ధ్రువీకరించలేదు. మీడియా ప్రతినిధి ఈ విషయాన్ని ధ్రువీకరించుకునేందుకు వెళ్లినా విక్రమ సింఘే కార్యాలయం స్పందించలేదు. రణిల్ విక్రమ సింఘే ఓ న్యాయవాది. రికార్డు స్థాయిలో ఆరుసార్లు శ్రీలంక ప్రధానిగా పనిచేశారు.2022లో శ్రీలంక దారుణమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టారు. శ్రీలంకలో ఆర్థికమాంద్యం కారణంగా పెద్దఎత్తున నిరసనలు, అల్లర్లు చెలరేగినప్పుడు మాజీ అధ్యక్షుడు కోటబయ రాజపక్ష రాజీనామాచేసి, శ్రీలంక నుంచి పారిపోయిన తరుణంలో అప్పటి యునైటెడ్ నేషనల్ పార్టీ నాయకుడైన రణిల్ విక్రమసింఘే ప్రెసిడెంట్ బాధ్యతలు స్వీకరించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in